చెత్తబుట్టలోకి కాంగ్రెస్ మ్యానిఫెస్టో

- 'ఉదయ్‌పూర్' తరహాలో పడెయ్యడం గ్యారెంటీ
- ప్రజల జీవితాల్లో మార్పు బీఆర్ఎస్ లక్ష్యం
- కాంగ్రెస్ నిరుద్యోగులకు పదువుల మార్పు కోసం ప్రజలు ఓటెయ్యవద్దు: కేటీఆర్
- ఆటో యూనియన్‌కు భవనం కట్టిస్తామని హామీ

శుక్రవారం తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్‌కే అధ్యక్షుడు రాంబాబు యాదవ్, ఆటోయూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీలు కర్రె ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'చెప్పింది చేస్తాం.. చేసేదే చెప్తాం. అదీ బీఆర్ఎస్ విధానం. సీఎం కేసీఆర్ దమ్ము అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం.. అలవికానీ హామీలు ఇస్తుందన్నారు. కాంగ్రెస్ సంస్థాగతంగా చేసుకున్న ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌నే చెత్తబుట్టలో పారేసిన వాళ్లు మ్యానిఫెస్టోను పారేయరని గ్యారెంటీ ఏమిటని ప్రశ్నించారు. కుటుంబానికి ఒక్క సీటు మాత్రమే ఇవ్వాలని రాసుకున్నారని, అదే తెలంగాణలో ఉత్తమ్‌కు మార్‌రెడ్డి వారి సతీమణి, కోమటిరెడ్డి బ్రదర్స్, వివేక్ బ్రదర్స్, మైనంపల్లి అండ్ సన్ ఇలా సొంత పార్టీలో చేసుకున్న డిక్లరేషన్‌నే చిత్తుకాగితంలా పారేశారని వివరించారు. ఈ క్రమంలో పార్టీ మ్యానిఫెస్టోకు ఏమాత్రం విలువ ఇవ్వరని పేర్కొన్నారు. కానీ, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను అమలు చేయడమే కాకుండా అందులో ఇవ్వని రైతుబంధు, కల్యాణలక్ష్మి, మిషన్ భగీరథ, కేసీఆర్ కిట్, దళితబంధు ఇలా అనేక పథకాలు చెప్పకపోయినా చేసిన మొగాడు..మొనగాడు సీఎం కేసీఆరేనని వివరించారు. ప్రజల జీవితాల్లో మార్పు రావాలె కానీ, కాంగ్రెస్ నిరుద్యోగులకు పదవుల మార్పు కాదని స్పష్టం చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌కే అనుబంధ ఆటోయూనియన్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు రూ.73 వేల కోట్లు రైతుబంధు ఇచ్చింది మార్పు కాదా? అని ప్రశ్నించారు. ఆడపిల్ల పెండ్లికి కల్యాణలక్ష్మి/షాదీముబారక్ ద్వారా రూ.1,00,116 ఇవ్వడం మార్పులో భాగంగా కాదా? 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అని పాడుకున్న దుస్థితి నుంచి 'నేను సర్కారు దవాఖాన్ల ప్రసూతి అయితే కేసీఆర్ కిట్ వస్తది' అనేది వైద్యంలో మార్పు జరగలేదా? వెయ్యి గురుకులాలతో ప్రపంచంతో పోటీపడే విద్యార్థులుగా తీర్చిదిద్దిన మార్పు మార్పు కాదా? అని ప్రశ్నించారు. 2014లో ఉన్న భూముల ధరలకు ఇప్పుడున్న ధరలకు పోల్చిచూస్తే మార్పు ఎంత జరిగింది? అని అడిగారు.

- నీళ్లు ఇవ్వని దిక్కుమాలిన స్థితి నుంచి ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా జరిగిన మార్పు మార్పు కాదా?
- కాంగ్రెస్ పాలనలో పడావు పడ్డ పొలాలు ఇవ్వాల కేసీఆర్ నాయకత్వంలో పచ్చటిమాగాణంగా మారింది.. ఇది మార్పు కాదా?
- భూముల ధరల్లో 2014లో ఎంత ఈరోజు ఎంత? మార్పు కనిపిస్తలేదా?
- ఆదివాసీ గూడేలు, లంబాడీ తండాలు గ్రామ పంచాయతీలయ్యాయి. ఇది మార్పు కాదా? - కేటీఆర్

ఎట్లుండె తెలంగాణ.. ఎట్లయింది

2014లో ఎట్లుండె తెలంగాణ.. ఇప్పుడు ఎట్లయింది తెలంగాణ అని కేటీఆర్ ఒక్కో రంగంలో తెలంగాణలో జరిగిన మార్పులను ఆవిష్కరించారు. కండ్ల ముందు జరిగిన మార్పును గమనించాలే కానీ, సోషల్ మీడియా సహా వివిధ మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న అసత్యాలను నమ్మకూడదని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో జరిగిన మార్పులను ఆటోయూనియన్ కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అన్ని పట్టణాలు, పల్లెలు బ్రహ్మాండంగా మారాయని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీకి నిరుద్యోగం ఎక్కువ?

కాంగ్రెస్ పార్టీలో పదవులు లేనితనంతో నాయకులు నిరుద్యోగులుగా ఉన్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి సహా అనేక పదవుల కోసం పోటీపడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు నిరుద్యోగులపై ఏమాత్రం ప్రేమలేదని విమర్శించారు. దేశంలో తెలంగాణ కంటే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం మరేదైనా ఉంటే రాహుల్‌గాంధీ చూపించాలని సవాల్ విసిరారు. పదేండ్లలో తెలంగాణ 1,60,083 ఉద్యోగాలను ఇచ్చిందని, దేశంలో ఇలా ఉద్యోగాలు ఇచ్చిన ఒక్క రాష్ట్రమైనా చూపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఆగం కావద్దని, అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ భరోసా అని చెప్పారు. సంపద పెంచడం, ప్రజలకు పంచడం అనే విధానంతో కేసీఆర్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో తండాలను గ్రామ పంచాయతీలు చేస్తామని, రైతులకు 9 గంటల కరెంట్ ఇస్తామని, మనిషికి ఆరు కిలోల బియ్యం ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదని గుర్తుచేశారు. ఇది ఆగమయ్యే సందర్భం కాదని, జాగ్రత్తగా ఆలోచించి ఓటేయ్యాలని విజ్ఞప్తి చేశారు. మార్చిలో పరీక్ష తప్పితే సెప్టెంబర్‌లో రాస్తామంటే కుదరదని, 1956లో ఒక్కచిన్న తప్పు చేస్తే 58 ఏండ్లు గోసపడ్డామని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లా తప్పు చేస్తే ఐదేండ్లు గోసపడ్తామని సూచించారు.

> ఆటో డ్రైవర్లకు రూ.100 కోట్ల పన్నును రద్దుచేసినా, రూ.5 లక్షల ప్రమాద బీమా, రవాణా పన్ను మాఫీ ఇలా అనేక మానవీయ నిర్ణయాలను ఎవరూ అడగకపోయినా చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే. ఆటో యూనియన్‌కు భవనం కట్టిస్తాం. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం.
> - కేటీఆర్

ఆర్నెళ్లకో ముఖ్యమంత్రి మారితే పెట్టుబడులెలా వస్తాయి?

తెలంగాణ బాగుండాలంటే హైదరాబాద్ బాగుండాలని, రాష్ట్రానికి 50 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తుందని కేటీఆర్ వివరించారు. హైదరాబాద్‌లో ఐటీ, సహా ఇతర పెట్టుబడులు రావాలంటే ఆర్నెళ్లకో సీఎం మారితే ఎలా వస్తాయి? అని ప్రశ్నించారు. ఇలాంటి స్థితి ఉంటే నిర్ణయాలు ఎలా జరుగుతాయని అడిగారు. 55 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఇప్పుడు ఒక్క చాన్స్ అనడం దారుణమన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో పేదవాళ్లు, పెద్దవాళ్లు అందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఆటో కార్మికులు ఒక్కొక్కరూ ఒక్కో కేసీఆర్‌లా ప్రతి ఒక్కరూ పది మందిని చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, కర్రె ప్రభాకర్, బీఆర్ఎస్‌కే అధ్యక్షుడు రాంబాబు యాదవ్, ఆటోయూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, అబీబ్, పాల్వంచ కృష్ణ, సైదులు, నిరంజన్, జబ్బార్, అశోక్, వాజిద్, శాతం రమేశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, శుక్రవారం మంత్రి కేటీఆర్ సమక్షంలో ఎన్ఎస్‌యూఐ జాతీయ కన్వీనర్ దినేష్‌సాగర్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీకందరికీ అండగా ఉంటానని, భవిష్యత్‌లో రాజకీయంగా ఎదిగేందుకు సంపూర్ణ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.

డీప్ ఫేక్ ప్రచారంపై జాగ్రత్త: కేటీఆర్

డీప్ ఫేక్ ప్రచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలకు వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఓటమి అంచున ఉన్న కాంగ్రెస్ పార్టీ రానున్న 4-5 రోజుల్లో అనేక ఫేక్ వీడియోలు, ఫేక్ వార్తలు ప్రచారం చేసే అవకాశం ఉన్నదని శుక్రవారం ట్విట్టర్‌లో హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ఫేక్ ప్రచారం వల్ల ఓటర్లు ప్రభావితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

శుక్రవారం 'ప్రగతి ప్రస్థానం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో పుస్తక రచయిత రమేశ్ హజారి

సంక్షేమంలో తెలంగాణకు స్వర్ణయుగం

- గడప గడపకూ కేసీఆర్ సంక్షేమ పథకాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్
- జర్నలిస్ట్ రమేశ్ హజారి 'ప్రగతి ప్రస్థానం' పుస్తకావిష్కరణ

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అమలుచేసిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, విధానాల ఫలితాలు తెలంగాణలోని గడప గడపకూ చేరాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ చెప్పారు. తెలంగాణ పథకాలు యావత్ దేశానికే మార్గదర్శనంగా నిలిచి, సంక్షేమంలో స్వర్ణయుగాన్ని సృష్టించాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాహారంగా రూపొందించిన 'ప్రగతి ప్రస్థానం- ఎట్లుండే తెలంగాణ ఎట్లయింది? పుస్తకాన్ని శుక్రవారం కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం పునరంకితం అవుతామని స్పష్టం చేశారు. కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలితంగానే రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గిందని, సాక్షాత్తు నీతి ఆయోగ్ నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ అద్భుత పనితీరును ఇలాంటి నివేదికలెన్నో తేల్చి చెప్పాయని వివరించారు. ప్రజల ఆశీర్వాదంతో వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించి, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన పథకాలు, ప్రజలకు చేరువైన తీరును గణాంకాలతో సహా తన సంపాదకత్వంలో "ప్రగతి ప్రస్థానం" పుస్తకంగా వెలువరించిన సీనియర్ జర్నలిస్టు రమేశ్ హజారి కృషిని అభినందించారు. తెలంగాణ సమాచారం తెలుసుకొనే ప్రతి ఒక్కరికీ ఈ పుస్తకం ఒక హ్యాండ్ బుక్‌గా ఉపయోగపడుతుందని చెప్పారు. తన సాహిత్య ప్రతిభతో సోషల్ మీడియాలోనూ, పాటలు, సాహిత్యం, పుస్తకాల రూపంలోనూ సృజనాత్మక శైలిలో ప్రభుత్వ కార్యాచరణను జనంలోకి తీసుకుపోయేలా జర్నలిస్టు రమేశ్ హజారి పాటుపడుతున్నారని మంత్రి కేటీఆర్ ప్రశంసించారు.

మార్పు అంటే.. 3 గంటల కరెంటా?

- ఆకలి చావుల కోసం కాంగ్రెస్‌కు ఓటెయ్యాలా?
- మోస్ట్ సక్సెస్‌ఫుల్ స్టార్టప్ స్టేట్‌గా తెలంగాణ అవతరించింది
- 80 చోట్ల బీఆర్ఎస్‌దే గెలుపు
- ఉద్యోగుల డీఏ విడుదలకు ఎన్నికల సంఘం అనుతివ్వాలి
- ఎడిటర్స్ మీట్ ది ప్రెస్‌లో కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): మార్పు కోసం తమకు ఓటెయ్యాలంటున కాంగ్రెస్.. ఏ మార్పు కోరుకుంటున్నదని, మళ్లీ 3 గంటల కరెంటు, ఆకలి చావుల రోజులు తిరిగిరావాలని కోరుకుంటున్నదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. స్కీములు పోయి మళ్లీ స్కామ్‌లు రావాలని కోరుకుంటున్నారా? అని ఎద్దేవా చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎడిటర్స్ మీట్ ది ప్రెస్‌లో కేటీఆర్ మాట్లాడారు. విపక్షాలు మార్పు కోసం ఓటు వేయాలని కోరుతున్నాయని, ఆరు నెలలకు ఒక సీఎం మారే మార్పు కోసమా? నిండిన చెరువులు పోయి ఎండిన చెరువులు వచ్చే మార్పు కోసమా? పచ్చని పొలాలు పోయి నెర్రెలు బారిన నేలల మార్పు కోసమా? వ్యవసాయాన్ని దండుగచేసి మళ్లీ రైతు ఆత్మహత్యలు తెచ్చే మార్పు కోసమా? గుజరాత్‌లో ఐదుసార్లు బీజేపీ రావచ్చు, దేశాన్ని 50 ఏండ్లు కాంగ్రెస్ పాలించవచ్చు, కానీ కేసీఆర్ రెండుసార్లు పాలించగానే మార్పు కావాలి అని అంటున్నారని పేర్కొన్నారు. గతంలో 50 ఏండ్లలో ఏమీ చేయని అసమర్థులకు ఓటు వేద్దామా? లేక ఆరున్న రేండ్లలోనే అభివృద్ధి, సంక్షేమంలో తనదైన ముద్ర వేసుకున్న కేసీఆర్‌కు ఓటు వేద్దామా? అనేది ప్రజలు ఆలోచించాలని కోరారు. ప్రజలు కోరుకున్న మార్పు 2014లోనే వచ్చిందని, ఇప్పుడు ఇక ఈ ప్రగతి ప్రస్థానం ఆగకూడదని పేర్కొన్నారు. నాటి టీఆర్ఎస్, నేటి బీఆర్ఎస్ 23 ఏండ్లలో ఒక్కసారి కూడా బీజేపీతో పొత్తు పెట్టుకోలేదని చెప్పారు.

బండి, రేవంత్ ఏ పరీక్ష రాశారు?

దేశంలో తెలంగాణ చేసినన్ని ఉద్యోగ భర్తీలు ఏ రాష్ట్రంలో చేయలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తాను ఆల్ ఇండియా ఎంట్రన్స్ రాసి పాసై పుణె యూనివర్సిటీలో చదివినట్టు తెలిపారు. అమెరికాలో ఉద్యోగం చేశానని చెప్పారు. నేడు మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ, రేవంత్ ఏనాడూ ఎంట్రన్స్‌లు రాసినట్టు తనకు తెలియదని, బండి సంజయ్ అసలు చదువుకున్నారో లేదో కూడా తనకు తెలియదన్నారు. వీళ్లు నిరుద్యోగుల తరపున వకాల్తా పుచ్చుకోవడం ఏమిటని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్‌తో వస్తామని స్పష్టం చేశారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా రెండున్నర లక్షలకు పైగా ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి, సుమారు లక్షా 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని కేటీఆర్ చెప్పారు.

70-80 సీట్లతో మళ్లీ అధికారం మాదే

సుస్థిర ప్రభుత్వం, సమర్థ నాయకత్వం రావాలంటే తమకు ఓటు వేయాలని కోరుతున్నామని, తెలంగాణ తెచ్చిన, పదేండ్లు రాష్ట్రాన్ని విజయవంతంగా పాలిన కేసీఆర్‌ను మళ్లీ గెలిపించాలని కోరుతున్నామన్నారు. 70-80 సీట్లు సాధిస్తున్నామన్నారు.

మోస్ట్ సక్సెస్‌ఫుల్ స్టార్టప్ స్టేట్ తెలంగాణ

కరోనా, ఎన్నికల కోడ్‌లు తీసేస్తే నికరంగా తాము పనిచేసింది ఆరున్నరేండ్లేనని కేటీఆర్ చెప్పారు. తాము ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, వచ్చే టర్మ్‌లోనూ అభివృద్ధి ప్రణాళికను తప్పనిసరిగా అమలుచేసి, ఓ మార్క్‌ను సెట్ చేస్తామని చెప్పారు. మోస్ట్ సక్సెస్‌ఫుల్ స్టార్టప్‌స్టేట్‌గా తెలంగాణ ఎదిగిందన్నారు. రైతుబంధు విడుదలకు ఎన్నికల సంఘం అనుమతివ్వడం సంతోషకరమని, ఉద్యోగులకు డీఏ విడుదలకు కూడా ఈసీ అనుమతి ఇవ్వాలని కోరారు.

లెక్కలేసుకొనే హామీలు ఇచ్చాం

ఆర్థికంగా అన్ని లెక్కలు వేసుకొనే మ్యానిఫెస్టో విడుదల చేశామని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్‌లాగ అడ్డగోలుగా ప్రకటన చేయలేదని తెలిపారు. రాజస్థాన్‌లో వారు మోటర్లకు మీటర్లు పెట్టినట్టే.. ఇక్కడ కూడా పెట్టిస్తారేమోనని చెప్పారు. కేంద్రం పెంచిన గ్యాస్ ధరను ఇకపై తామే భరిస్తామని హామీ ఇచ్చారు. కామారెడ్డి, నారాయణఖేడ్‌లో పేదరికంపై ఫోకస్ పెట్టామన్నారు. ప్రధానిలా జెండాలు ఊపినట్టు కాకుండా.. సీఎం పింఛన్లు పంచుకుంటూ తిరగలేడని, ప్రజలు ప్రగతి భవన్‌కు రాకుండా, స్థానికంగానే సమస్య పరిష్కారమయ్యే పరిస్థితిని కల్పించడమే తమ సీఎం లక్ష్యమని చెప్పారు. తనకు సీఎం పదవిపై ఆశ లేదని స్పష్టంచేశారు. 2014లో తాను పార్టీకి రాజీనామా చేద్దామని అనుకున్నానని, సోనియా పార్టీ విలీన ప్రక్రియను సరిగా హ్యాండిల్ చేయకపోవడంతో తమ నెత్తిన పాలు పోశారని చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు ఉండ్రు నర్సింహారావు, విజయ్‌కుమార్ రెడ్డి, వేణుగోపాల్ నాయుడు, కర్రి శ్రీరాం, డేవిడ్, జీఎస్ వాసు, బండారు శ్రీనివాసరావు, రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హోమ్‌లోన్‌పై వడ్డీభారం సర్కారుదే

మొదటిపేజీ తరువాయి...

ఒక్క కుటుంబానికి సొంత ఇల్లు కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. హౌజ్ ఫర్ ఆల్ లక్ష్యంగా గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూంతోపాటు హోమ్ లోన్‌తో ఇల్లు కొనుక్కునే వారి కోసం కొత్త స్కీం తీసుకొస్తామని, వడ్డీ భారం ప్రభుత్వమే భరిస్తుందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణను నిరక్షరాస్యత లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. క్రెడాయ్ హైదరాబాద్, నరెడ్కో తెలంగాణ, తెలంగాణ బిల్డర్స్ ఫోరం, తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ (టీడీఏ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరిగిన రియల్ ఎస్టేట్ సమ్మిట్‌లో కేటీఆర్ పాల్గొన్నారు. ఒకప్పుడు హైదరాబాద్ అంటే చార్మినార్ అని.. ఇప్పుడు సరికొత్త నగరం ఎంతో అద్భుతంగా కనిపిస్తున్నదన్నారు. వారసత్వంగా మనకు లభించిన హైదరాబాద్‌ను కాపాడుకొంటూనే, కొత్తగా వస్తున్న సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకుంటూ భవిష్యత్తు తరాలకు మెరుగైన హైదరాబాద్‌ను ఇవ్వాలన్నది బీఆర్ఎస్ ఉద్దేశమని చెప్పారు. వచ్చే టర్మ్‌లో బృహత్ ప్రణాళికలను అమలు చేయబోతున్నట్టు తెలిపారు.

బెంగళూరు కంటే హైదరాబాద్ చాలా బెటర్

రియల్ బూం ఇలాగే ఉండాలంటే తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉండాలని కేటీఆర్ అన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఐటీ ఉద్యోగాల కల్పనలో గత రెండేండ్లలో బెంగళూరు కంటే హైదరాబాద్ ముందంజలో నిలిచిందని తెలిపారు. బెంగళూరులో అనరాక్ అనే కంపెనీ 28 శాతం రియల్ గ్రోత్ పడిపోయిందని రెండు రోజుల క్రితం నివేదిక ఇచ్చిందని చెప్పారు. కీచులాటలు లేకుండా, సీఎం పదవి కోసం కొట్లాడుకోకుండా, ఆరు నెలలకోసారి సీల్డ్ కవర్ సీఎం వచ్చి మన నెత్తిన కూర్చోకుండా సొంతంగా నిర్ణయం తీసుకునే అధికారం ఉండాలన్నారు. రాష్ట్రం వచ్చిన కొత్తలో సీఎం కేసీఆర్ రియల్ ఎస్టేట్ రంగ నిపుణులతో ఒక రోజు కూర్చొని చర్చించి, ఆదే రోజు ఆరు జీవోలు ఇచ్చారని, అదే ఢిల్లీ వాళ్లు చేస్తారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. వేగంగా నిర్ణయాలు తీసుకోవాలంటే సుస్థిర ప్రభుత్వం, బలమైన నాయకత్వం ఉండాలన్నారు.

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి కే తారకరామారావు

జరిగిన మంచిని ఎన్నడూ మరిచిపోవద్దు

> తెలంగాణ వచ్చిన తరువాత హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో ఎన్నో నూతన విధానాలను ప్రభుత్వం తీసుకొచ్చింది. దీంతో హైదరాబాద్ గణనీయమైన వృద్ధిని చూసింది. ఇతర ప్రాంతాల వారు సైతం జీవించడానికి అనుకూలంగా మారింది. భారత ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో హైదరాబాద్ పాత్ర కీలకంగా మారింది. అక్టోబర్ 2023లో నగరంలో ఆస్తి రిజిస్ట్రేషన్ల సంఖ్య 25 శాతం పెరిగింది. గతంతో పోల్చితే ఇది 41 శాతం అదనం. బీఆర్ఎస్ ప్రభుత్వం బిల్డర్లు సమస్యలను పరిష్కరించింది. జరిగిన మంచిని ఎన్నడూ మరిచిపోవద్దు.
> - వీ రాజశేఖర్‌రెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు

రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో మరింత అభివృద్ధి

> హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నది. మెరుగైన లింక్ రోడ్లు, ఎస్ఎస్‌డీపీ, ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టుల్లో భాగంగా అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్‌లను నిర్మించింది. వీటి కారణంగా నగరంలో ట్రాఫిక్ నుంచి ఉపశమనం కలిగింది. రోడ్లు, రవాణా వ్యవస్థ మంచిగ ఉంటే పెట్టుబడులు వచ్చి రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందుతుంది. తెలంగాణ ప్రభుత్వం స్థిరంగా ఉండి చిత్తశుద్ధితో నూతన విధివిధానాలను అమలు చేయడంతోపాటు గ్రిడ్ విధానం, హైదరాబాద్ మెట్రో రైల్ నెట్‌వర్క్ విస్తరణ, ఔటర్ రింగ్ రోడ్డు వంటివి రియల్ ఎస్టేట్ అభివృద్ధి వైపు నడిచేందుకు దోహపడుతున్నాయి.
> - సునీల్ చంద్రారెడ్డి, నారెడ్కో అధ్యక్షుడు

తెలంగాణ కోసం చచ్చేంత మమకారం

బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని, ప్రభుత్వాన్ని విమర్శించేందుకు ప్రతిపక్షాలకు అంశాలే లేవని కేటీఆర్ అన్నారు. అందుకే ప్రజలకు సంబంధం లేని అంశాలను ఎన్నికల్లో ప్రస్తావిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టు తమకు ఉన్నది అహంకారం కాదని, తెలంగాణ కోసం చచ్చేంత మమకారమని తెలిపారు. చావు నోట్లో తల పెట్టి రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు సీఎం కేసీఆర్ అని గుర్తు చేశారు. సోషల్ మీడియా హడావిడి తప్ప క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పక్షానే ప్రజలు ఉన్నారని చెప్పారు.

తెలంగాణ మాడల్ అంటే?

సమగ్ర, సమీకృత, సమ్మిళిత, సమతుల్య, అభివృద్ధి తెలంగాణ మాడల్ అని కేటీఆర్ వివరించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటి వరకు మనకు ముగ్గురు సీఎంలు మాత్రమే గుర్తొస్తారని చెప్పారు. 'ప్రో బిజినెస్, ప్రో అర్బన్, ప్రో ఐటీ, ప్రో హైదరాబాద్ అనేవి చంద్రబాబు మాడల్. ప్రో రూరల్, ప్రో అగ్రి కల్చర్, ప్రో పూర్ అనేవి రాజశేఖర్‌రెడ్డి విధానాలు. అన్ని రంగాల అభివృద్ధే సీఎం కేసీఆర్ మాడల్. ఇది అరుదైన సమతూకం. ప్రపంచంలోనే తెలంగాణ అంటే ప్రోగ్రెసివ్ స్టేట్. మన రియల్ ఎస్టేట్ గ్రోత్ కోసం ఒక్కరోజే పది జీవోలు తీసుకొచ్చాం. తెలంగాణలో నేడు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఈ అరుదైన అవకాశాన్ని పోగొట్టుకోకుండా ఈ ప్రగతి, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలి. 25 ఏండ్లలో ఐటీ ఎగుమతి రూ.57 వేల కోట్లు ఉండె. 2021-22, 2022-23 మధ్య ఒక్క సంవత్సరంలోనే రూ.57 వేల కోట్ల గ్రోత్ వచ్చింది. 2014లో రూ.57 వేల కోట్లు ఉంటే.. 2014 నుంచి 2023 వరకు రూ.2.41 లక్షల కోట్లకు చేరింది. వరిధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హర్యానాను వెనక్కి నెట్టి నంబర్‌వన్‌గా నిలిచాం. టీఎస్ ఐపాస్‌తో 27 వేల పరిశ్రమలకు అనుమతులిచ్చాం. దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో 7.7 శాతం గ్రీన్ కవర్ పెరిగింది. పల్లె, పట్టణాలు కేసీఆర్ పాలనలో గొప్ప వృద్ధి సాధించాయి. తలసరి ఆదాయంలో రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచింది.

415 కిలోమీటర్ల మెట్రో

హైదరాబాద్ ఎంతో ప్రగతి సాధించిందని, ఇంకా సాధించాల్సింది చాలా ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. ప్యూచర్ రెడీ హైదరాబాద్ పేరుతో వచ్చే ఐదు నుంచి పదేండ్లలో 13 కీలకాంశాలను పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. 2047 నాటికి దేశానికి స్వాతంత్రం వచ్చి వందేండ్లు పూర్తవుతుందని, ఆలోగా భవిష్యత్ తరాలకు కొత్త హైదరాబాద్‌ను అందివ్వాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లో నిరంతర నీటి సరఫరా లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మెట్రో రైల్ నెట్‌వర్క్‌ను రాబోయే పదేండ్లల్లో మూడు దశల్లో 415 కిలోమీటర్లకు విస్తరిస్తామన్నారు. రాష్ట్రం నలుమూలకు గంట వ్యవధిలోనే చేరుకోవడం, విజయవాడ-హైదరాబాద్ మధ్య ప్రయాణ సమయం మరింత తగ్గించేందుకు గంటకు 150 కిలోమీటర్ల వేగంతో నడిచే స్పీడ్ రైళ్లను అందుబాటులోకి తేవటం తమ లక్ష్యమని వివరించారు. ర్యాపిడ్ రైల్ ట్రాన్సిట్ సిస్టం (ఆర్ఆర్‌టీఎస్) అందుబాటులోకి తెచ్చే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలకు మేలు జరిగేలా దాదాపు 790 కిలోమీటర్ల మేర కారిడార్లను గుర్తించామని తెలిపారు. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్యలో 500 నుంచి 1000 ఎకరాల్లో శాటిలైట్ టౌన్‌షిప్ పాలసీ సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. 2036లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేస్థాయికి హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని బీఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకున్నదని చెప్పారు.

పెట్టుబడులకు గమ్యస్థానం తెలంగాణ

> నగరంలో రియల్ ఎస్టేట్ రంగం నిరంతరం అభివృద్ధి చెందుతున్నది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణను పరిశ్రమలకు అనుకూలంగా మలచడానికి ప్రభుత్వం టీఎస్ ఐపాస్, టీఎస్ బీపాస్